కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో కూరగాయల ధరలు కిలో రూల్లో.. టమాట రూ.20, పచ్చిమిర్చి రూ.60, బెండ 60, కాకర 60, దొండ 50, దోస 30, ఆలుగడ్డ 25, చామ 60, కీర 35, బీర 50, వంకాయ 40, గోకర 60, బీన్స్ 60, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 60, క్యాబేజీ 30, క్యారెట్ 40, చిక్కుడు 70, ఉల్లిగడ్డ 25 (కేజీ), ములక్కాయలు (2)10 , క్యాలీఫ్లవర్ (1) 40, సొరకాయ (కేజీ) 20, అల్లం రూ.150, వెల్లుల్లి రూ.280 గా ఉన్నాయి.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): మోటార్ సైకిల్ అదుపుతప్పడంతో తీవ్ర గాయాలపాలైన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భారతి నగర్ డివిజన్ పరిధిలోని పాత ఎంఐజీ కాలనీకు చెందిన చందు(23) నగరంలోని ఓ సంస్థలో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా పనిచేస్తున్నాడు. కాగా సోమవారం రాత్రి తెల్లాపూర్ నుంచి పాత ఎంఐజీ కాలనీకు తన మోటార్ సైకిల్ వెళ్తుండగా తెల్లాపూర్ సర్కిల్ వద్దకు రాగానే అదుపుతప్పి కింద పడ్డాడు. తీవ్రగాయాలైన క్షతగాత్రున్ని అస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్మీ జవాన్‌ను ఢీకొట్టిన డ్రైవర్ అరెస్టు

మణికొండ: ఔటర్‌రింగ్ రోడ్డుపై సోమవారం ఆర్మీ జవాన్ కునాల్‌ను ఢీకొట్టిన రెడీమిక్స్ వాహనం డ్రైవర్, క్లీనర్‌ను మంగళవారం పోలీసులు రిమాండ్‌కు తరలించారు. వివరాల ప్రకారం.. ఔటర్‌రింగ్ రోడ్డుపై గచ్చిబౌలి నుంచి శంషాబాద్ వైపు వేగంగా వెళ్తున్న రెడీమిక్స్ వాహనం రోడ్డు దాటుతున్న జవాన్‌ను ఢీకొట్టడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సీసీ కెమెరాల ఆధారంగా డ్రైవర్ రుక్సద్ అన్సారీ, మహ్మద్ ఆలం అన్సారీని గుర్తించి అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

ఆదర్శ గురుకులం

- లక్ష్యాలకు అనుగుణంగా విద్యాబోధన
- ఉన్నత విద్యాసంస్థల్లో సీట్ల సాధనకు శిక్షణ

పేదింటి అమ్మాయిల పాలిట వరంగా మారిన ప్రభుత్వ విద్యాసంస్థ


సాంఘీక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల/పాఠశాల ప్రధాన భవనం

రాయదుర్గం: కార్పొరేట్, ప్రైవేటు కళాశాలలకు ఆ గురుకులం ఆదర్శంగా నిలుస్తోంది. తమకు తామే పోటీ అంటూ.. ప్రతి ఏటా మెడికల్ సీట్ల సాధనలో విద్యార్థుల ప్రతిభ అద్వితీయంగా మారింది. పేదింటి అమ్మాయిలను ఇంటర్మీడియట్ వరకు చదువు చెబుతూనే భవిష్యత్తులో డాక్టర్ కోర్సుల్లో చేరేలా ప్రత్యేక శిక్షణనిస్తున్నారు. ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్లు సాధిస్తూ ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలు, ఇతర గురుకుల విద్యాసంస్థలకు దీటుగా నిలుస్తోంది.

- జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చేలా ఉత్తమ ర్యాంకులు, ప్రతిష్టాత్మకమైన ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్లు సాధిస్తూ.. ఏటేటా తన సత్తాను గౌలిదొడ్డిలోని సాంఘీక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల చాటుతోంది. పదోతరగతి, ఇంటర్మీడియట్ రెగ్యులర్ కోర్సులలో కూడా అత్యుత్తమ ఫలితాలు సాధిస్తూ.. ప్రైవేటు కళాశాలలకు దీటుగా తయారవుతోంది. విద్యార్థులు, ఉపాధ్యాయుల ప్రత్యేక శ్రద్ధ, పట్టుదలతో చదివే విద్యార్థినులు చదువుతుండటంతో ఏటా


ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినులతో ప్రిన్సిపాల్

ఉత్తమ ఫలితాలు సాధిస్తూ.. ఆ తర్వాత పేదింటి ఆడపిల్లలను డాక్టరమ్మలను చేసేందుకు ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్లను సాధిస్తూ.. రాష్ట్రంలోనే ఆదర్శ గురుకులంగా ఈ కళాశాల నిలిచింది.

- ప్రతి ఏటా ఇంటర్మీడియట్‌లో బాలికలను చదివిస్తూ.. మరోవైపు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆర్‌సీఓ డాక్టర్ శారద పర్యవేక్షణలో గౌలిదొడ్డి కళాశాల ప్రిన్సిపాల్ అంబటిపూడి శారద ఆధ్వర్యంలో కో- ఆర్డినేటర్ వెంకటరమణ నాయకత్వంలో ప్రత్యేక శిక్షణను అందిస్తున్నారు.

'ఆపరేషన్ బ్లూ క్రిస్టల్ పథకం' ద్వారా..

- రాష్ట్రంలోని సాంఘీక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో ఎంపిక చేసిన వాటిల్లో 2015లో 'ఆపరేషన్ బ్లూ క్రిస్టల్' పేరిట ప్రత్యేక పథకాన్ని అమలు చేశారు. అప్పటి నుంచి ఈ కళాశాలలో ఎంసెట్, నీట్‌లో బాలికలకు ప్రత్యేక శిక్షణను ప్రారంభించారు. మొదట్లో 120 మందికే ఈ శిక్షణను ఇచ్చారు. అనంతరం 200 మందికి పెంచారు.
- ఏడాదిలో 43 మందికి డాక్టర్ కోర్సుల్లో సీట్లు రాగా.. గతేడాది మందికి సీట్లు వచ్చాయి. ఈసారి మాత్రం 200 మందికి ఎంబీబీఎస్ సీట్లు, బీడీఎస్‌లో 15 సీట్లు వచ్చేలా చేయాలని సంకల్పించి ప్రత్యేక శిక్షణను కొనసాగిస్తున్నారు.

అన్ని ఫలితాల్లో టాప్‌లో నిలవాలన్నదే లక్ష్యం..



అన్ని ఫలితాల్లో మా గురుకులాన్ని టాప్‌లోనే నిలపాలన్నదే లక్ష్యం. టెన్త్, ఇంటర్ ఫలితాల్లో 100 శాతం సాధనతో పాటు ఈ ఏడాది ఎబీబీఎస్ సీట్లు 200, బీడీఎస్ సీట్లు 15 సాధించాలని, ఇంజనీరింగ్‌లో కూడా చాలా సీట్లను సాధిస్తూ వస్తున్నాం. ప్రభుత్వ చొరవ, ఉన్నతాధికారుల పర్యవేక్షణ, తల్లిదండ్రుల సహకారం, ఉపాధ్యాయుల పని చేయాలనే తత్వంతో పనిచేయడం, సమిష్టి కృషి ఫలితంగా లక్ష్యాలను సాధిస్తూ వస్తున్నాం. గ్రామీణ ప్రాంతం నుంచి పేదింటి నుంచి వచ్చిన వారికి మంచి భవిష్యత్తును కల్పిస్తూ.. రావడం చాలా సంతోషంగా ఉంది. అమ్మాయిలకు చదువుతో పాటు ఉన్నత విద్యాసంస్థల్లో సీట్ల సాధనే లక్ష్యంగా ప్రణాళికాబద్ధంగా బోధన, శిక్షణను ఇస్తున్నాం. **– ఏ.శారద, ప్రిన్సిపాల్, గౌలిదొడ్డి గురుకుల బాలికల పాఠశాల**

ఇంటర్, టెన్త్ ఫలితాల్లో..

- ప్రతి ఏటా పదోతరగతి, ఇంటర్మీడియట్ రెగ్యులర్‌లో అత్యుత్తమ ఫలితాలతో సత్తా చాటారు. 2023లో టెన్త్‌లో 100 శాతం ఫలితాలు వచ్చాయి. 2023–24లో 98 శాతం ఫలితాలు సాధించింది.
- పేదింటి పిల్లలకు ఉత్తమమైన ఉపాధ్యాయులు, అధ్యాపకులతో ,ఇంగ్లిష్ మీడియంలో నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తున్నారు. ఇంగ్లిష్ మీడియంలో బోధన చేస్తూ.. వారికి వారిలో పట్టుదల, పోటీతత్వం, కష్టపడి చదివే అలవాటును చేసుకొనేలా చేస్తోంది. అందుకోసం ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలను ఏర్పాటు చేస్తోంది.

క్రీడల్లోనూ రాణింపు..

- చదువుతోపాటు ఉన్నత విద్య కోసం ఇంటర్మీడియట్ రెగ్యులర్ విద్యను అందిస్తూనే డాక్టర్లు, ఇంజనీర్లు అయ్యేందుకు నీట్, ఎంసెట్ వంటి పరీక్షలకు కూడా ప్రత్యేక శిక్షణ ఇవ్వడం తెలిసిందే.
- తాజాగా క్రీడలలో రాణించే వారిని ప్రోత్సహించేందుకు ఏర్పాట్లు చేయడంతో నైపుణ్యం కలిగిన క్రీడాకారులూ తయారవుతున్నారు. గోల్ఫ్ కోర్సులో ప్రత్యేక శిక్షణ కేంద్రాన్ని కూడా గురుకుల పాఠశాలలోనే ఏర్పాటు చేయగా.. అందులో విద్యార్థులు రాణిస్తున్నారు.

ఇంజనీరింగ్ విద్యార్థినులకు 'విష్' ఈ - కోర్సు

రాయదుర్గం: టాలెంట్ స్ప్రింట్, గూగుల్ సహకారంతో ఇంజనీరింగ్ మూడో సంవత్సరం చదివే విద్యార్థినుల కోసం కొత్త కోర్సును నిర్వహిస్తోంది. 15 నెలల ఆన్‌లైన్ కోర్సును 'ది విమెన్ ఇంజనీర్స్ (డబ్ల్యూఈ) కోర్సును నిర్వహిస్తారు. 2019లో ప్రారంభించిన ఈ కోర్సులో ఇప్పటి వరకు 950 మంది మహిళా ఇంజనీరింగ్ విద్యార్థులు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా మారి ఉద్యోగాలు చేసుకుంటున్నారు. ఈ కోర్సులో చేరిన వారికి 50 మంది మహిళా ఇంజనీరింగ్ విద్యార్థినులకు 100 శాతం స్కాలర్‌షిప్ అందించేందుకు కూడా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా మంగళవారం గూగుల్ టెక్నికల్ ఫెలో ఉపాధ్యక్షుడు పార్థరంగనాథన్, టాలెంట్ స్ప్రింట్ సీఈఓ, ఎండీ డాక్టర్ శంతనూపాల్ మాట్లాడుతూ.. విద్యార్థినులు నైపుణ్యాలను మెరుగుపరుచుకుని భవిష్యత్తులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా మార్చేందుకు ఎంతో ఉపయుక్తంగా మారుతుందన్నారు. వివరాలకు www.talentsprint.com ను సందర్శించాలని నిర్వాహకులు తెలిపారు.

నేడు 'మనూ'లో ప్రత్యేక సదస్సు

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం (మనూ)లో మహిళా విద్యా విభాగం ఆధ్వర్యంలో బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు ప్రత్యేక సదస్సును నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు 'మనూ' మహిళా విద్యా విభాగాధిపతి ప్రొఫెసర్ అమీనా తహసీన్ తెలిపారు. ఈ సందర్భంగా 'మహిళల చట్టం, సాధికారత' అనే అంశంపై హైదరాబాద్‌లోని సిబయాసిస్ లా స్కూల్ రీసెర్చ్ అండ్ పబ్లికేషన్ సెల్ హెడ్ డాక్టర్ అనితాసేబుల్ ప్రత్యేక ఉపన్యాసం చేస్తారన్నారు. 'మనూ' లా స్కూల్ డీన్ ప్రొఫెసర్ తబ్రేజ్ అహ్మద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాజకీయశాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ అఫ్రోజ్ ఆలమ్ పాల్గొంటారని వివరించారు.

వినతిపత్రం అందజేత


ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో రాష్ట్ర హోంగార్డుల సంఘం ప్రతినిధులు

రాయదుర్గం: తెలంగాణ రాష్ట్ర హోంగార్డ్స్ చైర్మన్, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని రాష్ట్ర హోంగార్డులు మంగళవారం నగరంలో కలిశారు. రాష్ట్రంలో హోంగార్డులు ఎదుర్కొంటున్న సమస్యలతో కూడిన సమస్యల వినతిపత్రాన్ని అందజేశారు. హోంగార్డుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించేలా చేయాలని వారు కోరగా.. దీనికి ఆయన సానుకూలంగా స్పందించినట్లు వివరించారు. హోంగార్డుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశోక్, వర్కింగ్ ప్రెసిడెంట్ దయానంద్, ఉపాధ్యక్షుడు అశోక్‌కుమార్, రాష్ట్ర కమిటీ సభ్యులు ప్రసాద్, మోహన్‌నాయక్, గోపాల్‌నాయక్ బొక్క గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కబ్జాకు గురైన చెరువును పునరుద్ధరించాలి

మాదాపూర్ సున్నం చెరువును పరిశీలించిన ఎమ్మెల్యే గాంధీ


అధికారులతో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ తదితరులు

మాదాపూర్: మాదాపూర్‌లోని సున్నంచెరువు పరిధిలోని ఎఫ్‌టీఎల్ బఫర్‌జోన్‌లో సర్వేనెంబర్ 16లో భూకబ్జాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ అన్నారు. మంగళవారం ఆయన అధికారులతో కలిసి చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సున్నం చెరువు ఎఫ్‌టీఎల్ ప్రాంతంలో నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను వెంటనే కూల్చివేయాలన్నారు. చెరువులో పూడ్చిన మట్టిని తీసివేసి చెరువును పరిరక్షించాలని కోరారు. ఎన్నికల సమయంలో ఇదే అదునుగా భావించి కబ్జాదారులు అక్రమ నిర్మాణాలను చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అదికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. చెరువు చుట్టూ ఫెన్సింగ్ వేసి హద్దులను ఏర్పాటు చేయాలన్నారు. కబ్జాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇరిగేషన్ డీఈ నరేందర్, ఏఈ లక్ష్మీనారాయణ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ రాజ్‌కుమార్, జీహెచ్‌ఎంసీ అధికారులు డీఈ ఆనంద్, ఏఈ రంజిత్, మాదాపూర్ డివిజన్ బీఆర్‌ఎస్ నాయకులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల నమ్మకాన్ని నిలబెట్టాం

- బీఆర్‌టీ యూనియన్‌ను గెలిపించండి
- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: కార్మికుల సంక్షేమం, ఆర్థిక అభ్యున్నతి లక్ష్యంగా కృషిచేస్తున్న బీఆర్‌టీ యూనియన్ కార్మిక సంఘాన్ని బలపరిచాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి పెన్నార్ పరిశ్రమ కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ నెల 6వ తేదీన పెన్నార్ పరిశ్రమంలో జరగనున్న కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని బండ్లగూడలో ఉన్న పెన్నార్ పరిశ్రమ వద్ద గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో జరిగిన కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో కార్మికులు ఎంతో నమ్మకంతో బీఆర్‌టీయూను నాయకత్వాన్ని బలపరిచారని, ఇందుకు అనుగుణంగా కార్మికులకు మెరుగైన వేతనం ఒప్పందం అందించడంతో పాటు వివిధ సౌకర్యాలు కల్పించినట్లు గుర్తు చేశారు. సమావేశంలో బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు, పెన్నార్ కార్మిక సంఘం అధ్యక్షులు రాంబాబుయాదవ్, బీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, బీఆర్‌ఎస్ పటాన్‌చెరు మండల అధ్యక్షుడు పాండు, కార్మిక సంఘం ప్రతినిధులు ఎన్‌వీ రావు, లక్ష్మారెడ్డి, సోమేశ్వర్, పెంటయ్య, వెంకటేశ్వర్లు, మహేష్, జానకిరామ్, రామ్‌మోహన్‌రావు, శ్రీరామ్ సింగ్, బీవీ రావు, కార్మికులు పాల్గొన్నారు.

బండల మల్లన్నస్వామికి పూజలు...

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు మండలం రామేశ్వరం బండ గ్రామంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన బండల మల్లన్నస్వామి కల్యాణం, జాతర మహోత్సవాల్లో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేలు ఘనంగా సన్మానించారు. మాజీ సర్పంచ్ ధరణి అంతిరెడ్డి, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు హెల్మెట్ల పంపిణీ


ఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హెల్మెట్లను అందజేస్తున్న దృశ్యం

శేరిలింగంపల్లి: ఇండియన్ హెడ్ ఇంజూరీ ఫౌండేషన్, హీరో మోటో కార్ప్ సహకారంతో ఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నల్లగండ్ల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు హెల్మెట్‌లను మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ హాజరై విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి బాలలే రేపటి పౌరులన్నారు. తల్లిదండ్రులు ద్విచక్రవాహనంపై వెళ్లే సమయంలో హెల్మెట్ విధిగా ధరించాలని, అదే విధంగా చిన్నారులు కూడా హెల్మెట్ పెట్టుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నల్లగండ్ల స్కూల్‌కు చెందిన 120 మంది విద్యార్థులకు ఎస్ ఫౌండేషన్ హెల్మెట్లను అందించేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఫౌండేషన్ రాష్ట్ర వ్యాప్తంగా 50 వేల మంది విద్యార్థులకు హెల్మెట్‌లు పంపిణీ చేసేందుకు ముందుకు రావడం హర్షించాల్సిన విషయమన్నారు. ఎస్ ఫౌండేషన్ నిర్వాహకులు బేగ్, రియాన్, ప్రధానోపాధ్యాయులు మహేందర్ రెడ్డి, టీచర్లు రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

16 నెలల చిన్నారికి అరుదైన శస్త్ర చికిత్స


ఉమెన్, చైల్డ్ ఆస్పత్రిలో శస్త్ర చికిత్స అనంతరం డాక్టర్ల బృందంతో..

మాదాపూర్: దేశంలో మొట్టమొదటి సారిగా మెడికవర్ ఉమెన్, చైల్డ్ ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స చేశారు. మాదాపూర్‌లోని ఆస్పత్రిలో 16 నెలల శిశువుకు మంగళవారం పీడియాట్రిక్ వైద్య విభాగం వైద్యులు సర్జరీ చేసి శిశువుకి ప్రాణాలను కాపాడారు. పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఆశీస్‌సప్రె మాట్లాడుతూ.. టాంజానియాకు చెందిన 16 నెలల శిశువుకు అరుదైన పుట్టుకతో వచ్చిన వైకల్యంతో ఆసుపత్రికి వచ్చారు. గుండె, ఛాతీగోడ, ఉదర ప్రాంతాలను ప్రభావితం చేసే సంక్లిష్ట లోపాల పుట్టుకతో జన్మించిన పాపకు గుండె ఛాతీ కుహరం వెలుపల కొట్టుకోవడం, చర్మంతో మాత్రమే కప్పబడి ఉండటం లాంటి సమస్యలు ఉన్నాయన్నారు. శిశువుకు 14 గంటల పాటు శ్రమించి శస్త్ర చికిత్స చేశామన్నారు. సీవీటి సర్జన్ డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ మధుమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆగ్జిలరీల ఏర్పాటుపై నాయకుల సమావేశం


మాట్లాడుతున్న ఈఆర్‌ఓ, డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్ కార్యాలయంలో రాజకీయ పార్టీ నేతలతో ఈఆర్‌ఓ, డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి మంగళవారం సమావేశం నిర్వహించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఉన్న పోలింగ్ స్టేషన్లు, ఆగ్జిలరీల ఏర్పాటు, పోలింగ్ స్టేషన్ లొకేషన్ చేంజ్, పోలింగ్ స్టేషన్ల పేరు మార్పు వంటి వాటిపై వారితో చర్చించారు. ఇప్పటికే శేరిలింగంపల్లి నియోజకవర్గంలో 622 పోలింగ్ స్టేషన్లు ఉండగా.. 11 ఆగ్జిలరీలను ఏర్పాటు చేశామని, వాటిని ఉన్నతాధికారులకు పంపినట్లు వివరించారు. పోలింగ్ స్టేషన్ లొకేషన్ చేంజ్, పేరు మార్పిడి గురించి చర్చించినట్లు పేర్కొన్నారు. ఏఈఆర్‌ఓ ప్రేమ్‌కుమార్, డిప్యూటీ తహశీల్దార్ బాలవర్ధన్, వివిధ రాజకీయ పార్టీల నేతలు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ రిజిస్ట్రార్‌ను కలిసిన ఉద్యోగులు


హెచ్‌సీయూ రిజిస్ట్రార్‌తో హెచ్‌సీయూ ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు

రాయదుర్గం: హెచ్‌సీయూలోని ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధి బృందం హెచ్‌సీయూ రిజిస్ట్రార్ డాక్టర్ దేవేష్‌నిగమ్‌ను కలిశారు. హెచ్‌సీయూ పరిపాలనా భవనంలో మంగళవారం ఆయనను కలిసి సన్మానించారు. ఇటీవల ఆయనకు 'ఎక్సలెన్స్ ఇన్ ఎడ్యుకేషన్ అవార్డు' వచ్చిన సందర్భంగా అభినందించామన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు అశోక్, ప్రధాన కార్యదర్శి శాంతయ్య, నాయకులు రాము, నర్సింహ్మా, ప్రేమ్ కుమార్, తిరుమల్‌సింగ్ ఇతర సభ్యులు పాల్గొన్నారు.

ఉర్దూ దూరవిద్యలో కొత్త కోర్సులను ప్రారంభించాలి

'మనూ' వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్


'మనూ'లో విద్యార్థుల ప్రదర్శన

రాయదుర్గం: ఉర్దూ మాధ్యమం ద్వారా దూరవిద్యలో మరిన్ని కొత్త కోర్సులను ప్రారంభించాల్సిన అవసరం ఉందని విషయాన్ని గుర్తించామని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ అన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో లెర్నర్ సపోర్ట్ సెంటర్‌ల సమన్వయకర్తల కోసం మంగళవారం రెండ్రోజుల నేషనల్ ఓరియంటేషన్-కమ్-వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా ఉన్న 'మనూ' ప్రాంతీయ, ఉపప్రాంతీయ కేంద్రాలను మరింత పటిష్టం చేసేందుకు పూర్తి తోడ్పాటును అందిస్తున్నామన్నారు. అనంతరం దేశవ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీ పరిధిలోని ప్రాంతీయ/ఉపప్రాంతీయ కేంద్రాల పనితీరులో అత్యుత్తమమైన వాటిని గుర్తించారు. అందులో మూడింటికీ ట్రోఫీలతో పాటు ఒక్కొక్కరికి రూ.లక్ష నగదు బహుమతులను అందజేశారు. 'మనూ' రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్, డైరెక్టరేట్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ మహ్మద్ రజావుల్లాఖాన్, ప్రాక్టీస్ ప్రొఫెసర్ రామకొండపల్లి, డీడీఈ సలహాదారు ప్రొఫెసర్ వెంకయ్య, డాక్టర్ సమీనా బసు, డాక్టర్ షేక్ వసీమ్ మాట్లాడారు.

ఆకట్టుకున్న ప్రదర్శనలు..

'మనూ'లోని కల్చరల్ యాక్టివిటీ సెంటర్ సహకారంతో సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. గాయకులు మొహతర్మా అప్షా, సల్మాన్ మీర్జా,విద్యార్థుల ప్రదర్శన ఆకట్టుకుంది. యూనివర్సిటీ డ్రామా క్లబ్ ఆధ్వర్యంలో యాక్ట్ ప్లే, స్కిట్, మైమ్ ప్రదర్శనలు అలరించాయి. మ్యూజిక్ క్లబ్ గ్రూప్ సాంగ్స్, హిందుస్తానీ సోలోలను ప్రదర్శించింది. కల్చరల్ కో-ఆర్డినేటర్ మేరాజ్ అహ్మద్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు జరిగాయి.

ఆస్తిపన్ను వసూళ్లపై సమీక్ష


సమీక్షలో శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కమిషనర్ స్నేహ శబరీష్

గచ్చిబౌలి: ఆస్తిపన్ను బకాయిల వసూళ్లలో వేగం పెంచాలని, నిర్ణీత సమయంలోపు టార్గెట్‌లు పూర్తి చేయాలని శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కమిషనర్ స్నేహ శబరీష్ అధికారులను ఆదేశించారు. మంగళవారం శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కార్యాలయంలో ఆస్తి పన్ను వసూళ్లపై ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సెల్ఫ్ అసెస్‌మెంట్ల దరఖాస్తులను పరిశీలించి భవనాలకు ట్యాక్స్ రివైజ్ చేయాలని సూచించారు. 213 నోటీసు జారీ చేసి కమర్షియల్ భవనాలను గుర్తించి జీహెచ్‌ఎంసీ ఖజానాకు ఆదాయం సమకూర్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్, బిల్ కలెక్టర్లపై ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటానని అమె హెచ్చరించారు. పాత బకాయిల కోసం వన్‌టైమ్ స్కీమ్ (ఓటీఎస్)లో 90 శాతం వడ్డీ సద్వినియోగం చేసుకోవాలని భవన యజమానులకు సూచించారు. సర్కిళ్ల ఉప కమిషనర్లు రజనీకాంత్ రెడ్డి, వంశీకృష్ణ, సురేష్, ఏఎంసీలు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లు పాల్గొన్నారు.

చిగురిస్తున్న ఆశలు

- మెట్రో రైలు వంతెన నిర్మాణానికి భూసార పరీక్షలు ప్రారంభం
- పటాన్‌చెరు ఇస్నాపూర్ వరకు మెట్రో సౌకర్యం
- హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం నుంచి పటాన్‌చెరు మీదుగా ఇస్నాపూర్ వరకు మెట్రోరైలు సౌకర్యం కల్పించేందుకు ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో వంతెన నిర్మాణం కోసం ఇప్పటికే భూసార పరీక్షల (సాయిల్ టెస్ట్) ప్రక్రియ పారంభం కావడంతో స్థానిక ప్రజల్లో మెట్రో రైలుపై ఆశలు చిగురిస్తున్నాయి. త్వరలోనే పనులు కూడా ప్రారంభమవుతాయని విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇంటి అద్దెలకు డిమాండ్

ప్రభుత్వం మెట్రోరైలు సౌకర్యం కల్పిస్తామని ప్రకటించడంతో సమీపంలోని ఆయా కాలనీలలో ఇంటి అద్దెలను అమాంతం పెంచుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమీప ప్రాంతాల నుంచి నిత్యం వేలాదిమంది విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులు నగర ప్రాంతానికి వెళ్లొస్తుంటారు. ఇదే అదునుగా భావించి ఇంటి అద్దెలను రూ.500 నుంచి రూ.1000వరకు పెంచారని పలువురు వాపోతున్నారు. రానున్న రోజుల్లో ఇంటి అద్దెలు మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టిలో ఉంచుకొని ఇంటి అద్దెలు పెరగకుండా నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ట్రాఫిక్ సమస్యతో తిప్పలు..

నిత్యం రద్దీగా ఉండే రామచంద్రాపురం, పటాన్‌చెరు ఇస్నాపూర్ ప్రాంతాల్లో తరచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతుండటంతో బస్సుల్లో ప్రయాణం చేయలేని పరిస్థితి నెలకొంది. దీంతో సకాలంలో గమ్యానికి చేరుకోవడం కోసం చాలామంది వాహనదారులు తమ వాహనాలను లింగంపల్లి చౌరస్తా ప్రాంతంలోని ప్రైవేట్ పార్కింగ్‌లలో పార్కింగ్ చేసి మియాపూర్ వరకు వెళ్లి మెట్రో రైలును లేదా లింగంపల్లికు వెళ్లి ఎంఎంటీఎస్ రైలును ఆశ్రయిస్తున్నారు. దీంతో ప్రభుత్వం త్వరితగతిన స్పందించి మెట్రోరైలు సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకు రావాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.


జాతీయరహదారి డివైడర్‌పై భూసార పరీక్షలునిర్వహిస్తున్న సిబ్బంది(ఫైల్‌ఫోటో)

సీఎస్‌ఆర్ ప్రాజెక్టు సంస్థ సేవలు అభినందనీయం

మియాపూర్: పేద విద్యార్థులు, ప్రజలకు సామాజిక సేవ కార్యక్రమాలు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని న్యూ కాలనీలోని మండల ప్రాథమిక పాఠశాలలో అదనపు గదుల నిర్మాణం కోసం సమ్‌టోటల్ సీఎస్‌ఆర్ ప్రాజెక్టు సంస్థ వారి ఆధ్వర్యంలో రూ.15 లక్షలతో నూతనంగా చేపట్టబోయే అదనపు తరగతి గదుల నిర్మాణ పనులకు కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ఎమ్మెల్యే గాంధీ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు మేలు కలిగేలా తరగతి గదులు నిర్మిస్తున్నారని త్వరితగతిన పనులు పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకు రావాలని సూచించారు. సంస్థ డైరెక్టర్ ఉషశ్రీ, ఇన్‌చార్జి హెచ్‌ఎం.రాంమోహన్‌రావు, ఉపాధ్యాయులు అర్చన, విజయ్, వనజ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే అరెకపూడి గాంధీతో పాఠశాల బృందం

అక్రమ నిర్మాణాల కూల్చివేత


అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న శేరిలింగంపల్లి రెవెన్యూ అధికారులు

శేరిలింగంపల్లి: ప్రభుత్వ భూమిలో చేపట్టిన అక్రమ నిర్మాణాలను శేరిలింగంపల్లి రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. శేరిలింగంపల్లి మండల పరిధిలోని కంచె గచ్చిబౌలి సర్వే నెంబర్ 26 ప్రభుత్వ భూమిలో వెలిసిన అక్రమ నిర్మాణాలను మంగళవారం నేలమట్టం చేశారు. హెచ్‌సీయూ బస్ డిపో నుంచి బొటానికల్ గార్డెన్‌కు వెళ్లే రోడ్డులో అక్రమంగా నిర్మిస్తున్న నిర్మాణాలను ఆర్ఐ రాంబాబు ఆధ్వర్యంలో సిబ్బంది జేసీబీ సాయంతో కూల్చివేశారు.

పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించాలి

బండ్లగూడ: ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా కళాశాలల నిర్వాహకులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర సూచించారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయన కార్పొరేషన్ పరిధిలోని విశ్వభారతీ జూనియర్, మైనార్టీ రెసిడెన్షియల్ కళాశాలలను మంగళవారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా అన్ని శాఖల అధికారులు ప్రత్యేక సదుపాయలు కల్పించేలా పాటుపడుతున్నామన్నారు.